చదువు

ఈనాడు
విజయవాడ
బుధవారం మే 23, 2018 ■ e-mail: edc@eenadu.in


డిగ్రీ అంటే... డిగ్రీనా అని పెదవి విరిచే రోజులకు కాలం చెల్లింది. మన డిగ్రీలన్నీ మారిపోతున్నాయ్. సంప్రదాయ రీతులను దాటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త రూపంలో ప్రొఫెషనల్ కోర్సులకు దీటుగా వస్తున్నాయి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి సాయపడే విద్యను నేటి యువతకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం డిగ్రీ కోర్సులను పునర్వ్యవస్థీకరించింది. ఐఓటీ, డేటా సైన్స్, బిగ్‌డేటా, అనలిటిక్స్, సీడ్ టెక్నాలజీ, సిమెంట్ కెమిస్ట్రీ, ఎకనోమెట్రిక్స్, హిస్టరీ రైటింగ్, ఆర్కియాలజీ, ఫంక్షనల్ తెలుగు వంటి ఎన్నో రకాల కాంబినేషన్లను డిగ్రీ స్థాయిలో అందిస్తున్నారు. అందుకే నిపుణులు సైతం 'ఒకప్పటి డిగ్రీ కాదు!' అంటున్నారు. అభ్యర్థులు తమ అభిరుచి మేరకు వాటిని తీసుకొని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చు. వేగంగా ఉద్యోగావకాశాలను అందించే ఉద్దేశంతో ఈ కోర్సులను రూపొందించారు.




# ఒకప్పటి డిగ్రీ కాదు గురూ!

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన మెరుగుపడేలా ప్రత్యేక కోర్సులు డిగ్రీలో వస్తున్నాయి. పరిశ్రమల వారికి అనుకూలంగా ఉండేలా ఈ కోర్సులను తీర్చిదిద్దారు. డిగ్రీ కళాశాలలను పర్యవేక్షించే కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సంప్రదాయ కోర్సులకు భిన్నంగా వీటిని రూపొందించారు. గత విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో మార్కెట్ ఓరియంటెడ్ కోర్సులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 12 ప్రభుత్వ, స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాలల్లో ప్రారంభించారు. పరిశ్రమల అవసరాలపై అధ్యయనం చేసిన అధ్యాపకుల బృందం వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశాలూ, చర్చల అనంతరం సబ్జెక్టులను తయారు చేసింది. నాలుగు, ఆరు సెమిస్టర్లలో ఆయా కంపెనీల్లో విద్యార్థులు అప్రెంటిస్‌షిప్ చేసేలా ప్రణాళిక రూపొందించారు.

## కసరత్తు చేశాకే.. కొత్త కోర్సులు



మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సుల రాక అవసరం. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా మార్కెట్ ఓరియంటెడ్ సబ్జెక్టులను ప్రవేశపెట్టాం. గత ఏడాది 12 కళాశాలల్లో వీటిని అమలుచేశాం. నాలుగు, ఆరు సెమిస్టర్లలో కంపెనీల్లో అప్రెంటిస్‌షిప్ చేసేలా రూపొందించాం. నిపుణులతో పాఠాలు చెప్పించాలనే ఉద్దేశంతో మొదట స్వయంప్రతిపత్తి కళాశాలల్లోనే ప్రారంభించాం. బీఎస్సీలో 30 సీట్ల వరకు ఉండగా.. బీఏలో ఆయా కోర్సులను అనుసరించి 30-50 వరకు సీట్లున్నాయి. ప్రస్తుతం ఈ సబ్జెక్టుల అమలు బాగానే ఉంది.

ఉపాధి అవకాశాలు లభించాలనే ఉద్దేశంతో కంపెనీల ప్రతినిధులతో చర్చించి, వారి సూచనలు, సలహాలను తీసుకొని ఈ సబ్జెక్టులను నిపుణులు రూపొందించారు. ప్రత్యేక కమిటీ ద్వారా అధ్యయనం చేయించారు. ఈ కమిటీ పరిశ్రమల వారితో సమావేశమై వారి అభిప్రాయాలను తీసుకుంది. ప్రాంతాలవారీగా క్షేత్రస్థాయి అవసరాలపై అధ్యయనం చేసింది. మొదట 29 సబ్జెక్టులను గుర్తించగా.. వీటిల్లో 25 సబ్జెక్టులను ఉన్నత విద్యామండలి ఆమోదించింది.

**- డి.గిరి,** అకడమిక్ గైడెన్స్ అధికారి, కళాశాల విద్యా కమిషనరేట్

## చివరి సంవత్సరంలో స్పెషలైజేషన్

డిగ్రీలో మూడేళ్లకు కలిపి ఆరు సెమిస్టర్లు ఉండగా చివరి సెమిస్టర్‌లో స్పెషలైజేషన్‌ను ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టింది. దీన్ని క్లస్టర్ ఎలక్టివ్‌గా పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా చివరి ఏడాది చదువుతున్నవారు ఎనిమిదో పేపర్ స్పెషలైజేషన్‌ను ఎంపిక చేసుకోవాలి. ఉదాహరణకు బీఎస్సీ కంప్యూటర్ సైన్సు విద్యార్థికి కంప్యూటర్ సైన్స్, భౌతికశాస్త్రం, గణితం అధ్యయనాంశాలుంటే ఈ మూడింటిలో ఒక సబ్జెక్టును స్పెషలైజేషన్‌కు ఎంపిక చేసుకోవాలి. బీఎస్సీ కంప్యూటర్స్ ఎంపిక చేసుకుంటే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్ డేటా అనలిటిక్స్, మల్టీమీడియా అంశాల్లో ఏదో ఒకదాంట్లో స్పెషలైజేషన్ సాధించాలి. ఉదాహరణకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తీసుకుంటే ఇందులో మూడు పేపర్లుంటాయి. వీటి అధ్యయనం వల్ల విద్యార్థి నైపుణ్యం సాధించేందుకు అవకాశం ఉంటుంది. జంతుశాస్త్రంలో ప్రత్యేక కోర్సుల కింద మత్స్య పరిశ్రమ(ఆక్వాకల్చర్), రోగ నిర్ధారణ పరీక్షలు (మెడికల్ డయాగ్నస్టిక్స్), పట్టు పరిశ్రమ (సెరికల్చర్)ను ప్రవేశపెట్టారు. విద్యార్థులు తమ ఇష్ట ప్రకారం వీటిల్లో ఏదో ఒకదాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

## క్లస్టర్ ఎలక్టివ్ ఇలా..

క్లస్టర్ ఎలక్టివ్ కింద సబ్జెక్టులను విద్యార్థులు ఎంపిక చేసుకునే విధానంలో కొన్ని నిబంధనలు విధించారు. ఒక స్పెషలైజేషన్‌ను ఎంపిక చేసుకునే విద్యార్థుల సంఖ్య కనీసం పది ఉండాలి. ఒక గ్రూపులో ఉండే విద్యార్థులు ఎక్కువమంది ఒకే అంశాన్ని ఎంపిక చేసుకుంటే తక్కువ మంది ఉన్నవారికి పాఠాలు బోధించడం, పరీక్షల నిర్వహణ భారంగా మారుతుందనే ఉద్దేశంతో దీన్ని తీసుకొచ్చారు.

## డిగ్రీతోపాటు ఉపాధి శిక్షణ, ఉద్యోగం

రాష్ట్రంలో 2018-19 విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధినిచ్చే కోర్సులపై శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించనున్నారు. కమ్యూనిటీ కళాశాలల పేరుతో ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. సెంచూరియన్ వర్సిటీ, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తాయి. రాష్ట్రంలో ఇప్పటికే స్వయంప్రతిపత్తి కలిగిన ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో రెండు కోర్సులను అమలు చేస్తున్నారు. ఇక్కడ బీఎస్సీ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులకు ఎక్స్‌రే, ఆపరేషన్ థియేటర్, అనస్థీషియా టెక్నీషియన్ కోర్సులు అందిస్తున్నారు. రోజువారీ డిగ్రీ తరగతులకు ఆటంకం లేకుండా ప్రత్యేక సమయాల్లో విద్యార్థులకు ఈ ఉపాధి కోర్సులపై శిక్షణ ఇస్తారు. విద్యార్థి ఆసక్తికి అనుగుణంగానే కోర్సుల ఎంపిక ఉంటుంది.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లో మొదటి విడతగా 30 కళాశాలల్లో అమలు చేయనున్నారు. ఒక్కో కోర్సులో బ్యాచ్‌కు 30 మంది ఉంటారు. విద్యార్థులకు ప్రతి సెమిస్టర్‌కు 30 గంటలపాటు శిక్షణ అందించనున్నారు.

బీఎస్సీ (ఎంపీసీ) వారికి యూనిట్ గేమింగ్ సాఫ్ట్‌వేర్, బీకాం వారికి ట్యాలీ-అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్, బీఎస్సీ(లైఫ్‌సైన్సు) వారికి ఎక్స్‌రే, కార్డియో, ఆపరేషన్ థియేటర్, అనస్థీషియా టెక్నీషియన్, బీఏ వారికి బీపీవో, డేటా ఎంట్రీ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుంది. 30మంది విద్యార్థులకు ఒక బ్యాచ్ ఉంటుంది. మూడేళ్ల డిగ్రీలోనే మూడు నెలలపాటు కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ల్యాబ్‌ల ఏర్పాటు, కోర్సులకు సంబంధించిన వ్యయం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. విద్యార్థులకు ఉచితంగానే అందిస్తారు.

గవర్నమెంట్, ఎయిడెడ్, అటానమస్ కళాశాలలకు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. **ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ:** 25 మే, 2018. **వెబ్‌సైట్:** www.cceinfo.ap.gov.in

ప్రైవేటు కళాశాలలకు ఆఫ్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఆయా కాలేజీలను సంప్రదించాలి.

మరిన్ని కాంబినేషన్లు, కళాశాలలు, వాటి చిరునామాలు, ఫోన్ నెంబర్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు.

**- మాసిన శ్రీనివాసరావు,** ఈనాడు- అమరావతి




### కళాశాలలు, సీట్లు

ప్రభుత్వ కళాశాలలు: 146
ఎయిడెడ్ కళాశాలలు: 127
ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాలలు: 14
ఎయిడెడ్ స్వయంప్రతిపత్తి కళాశాలలు: 27
మొత్తం సీట్లు: 1,14,191
ప్రైవేటు కళాశాలు మొత్తం: 1,153
సీట్లు: 3,17,393

### సైన్సు ప్రోగ్రామ్స్- బీఎస్సీ

| రెండు సబ్జెక్టుల కాంబినేషన్ | మార్కెట్ ఓరియంటెడ్ సబ్జెక్టు |
|---|---|
| గణితం, స్టాటిస్టిక్స్ | ఆక్చురియల్ సైన్సు |
| ఆర్థిక శాస్త్రం/ అకౌంటెన్సీ/ చరిత్ర/పొలిటికల్ సైన్సు | బేసిక్ అప్లైడ్ స్టాటిస్టిక్స్ |
| గణితం, భౌతికశాస్త్రం | పునరుత్పాదక శక్తివనరులు |
| గణితం, భౌతికశాస్త్రం | వెబ్ ఎనేబుల్డ్ టెక్నాలజీస్ |
| కంప్యూటర్‌సైన్సు, స్టాటిస్టిక్స్ | డేటా సైన్సు |
| గణితం, కంప్యూటర్‌సైన్సు | మల్టీమీడియా |
| గణితం, కంప్యూటర్‌సైన్సు | క్లౌడ్ కంప్యూటింగ్ |
| గణితం, ఎలక్ట్రానిక్స్ | ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ |
| గణితం, రసాయనశాస్త్రం | పారిశ్రామిక రసాయన శాస్త్రం |
| జియాలజీ, రసాయనశాస్త్రం | పారిశ్రామిక రసాయన శాస్త్రం |
| వృక్షశాస్త్రం, రసాయనశాస్త్రం | పారిశ్రామిక రసాయన శాస్త్రం |
| జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం | పారిశ్రామిక రసాయన శాస్త్రం |
| గణితం, రసాయనశాస్త్రం | అనలిటికల్ కెమిస్ట్రీ |
| జియాలజీ, రసాయనశాస్త్రం | అనలిటికల్ కెమిస్ట్రీ |
| వృక్షశాస్త్రం, రసాయనశాస్త్రం | అనలిటికల్ కెమిస్ట్రీ |
| జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం | అనలిటికల్ కెమిస్ట్రీ |
| గణితం, రసాయనశాస్త్రం | సిమెంటు రసాయన శాస్త్రం |
| జియాలజీ, రసాయనశాస్త్రం | సిమెంటు రసాయన శాస్త్రం |
| రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం | సేంద్రియ వ్యవసాయం |
| రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం | ఉద్యాన వ్యవసాయం |
| రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం | సీడ్ టెక్నాలజీ |
| రసాయనశాస్త్రం, జంతుశాస్త్రం | ఆక్వా సాంకేతికత |
| రసాయనశాస్త్రం, జంతుశాస్త్రం | పట్టుపరిశ్రమ సాంకేతికత |
| రసాయనశాస్త్రం, జంతుశాస్త్రం | పారామెడికల్ సాంకేతికత |
| **బీఏలో..** | |
| చరిత్ర, అర్థశాస్త్రం | పర్యటక, రవాణా నిర్వహణ |
| చరిత్ర, అర్థశాస్త్రం | పురావస్తు |
| చరిత్ర, అర్థశాస్త్రం | చరిత్ర రాయడం(హిస్టరీ రైటింగ్) |
| అర్థశాస్త్రం, గణితం/స్టాటిస్టిక్స్ | ఎకనోమెట్రిక్స్ |
| పొలిటికల్ సైన్సు, అర్థశాస్త్రం | కార్యాలయ నిర్వహణ, సెక్రెటేరియల్ ప్రాక్టీస్ |
| పొలిటికల్, చరిత్ర/అర్థశాస్త్రం | జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ |
| చరిత్ర/పొలిటికల్‌సైన్సు/అర్థశాస్త్రం | ఇంగ్లిష్ ఫర్ డిజిటల్ ఏజ్ |
| అర్థశాస్త్రం, చరిత్ర/పొలిటికల్‌సైన్సు | ఫంక్షనల్ తెలుగు |

### ఈ కోర్సులు అందుబాటులో ఉన్న కళాశాలలు..

❍ డాక్టర్ వీఎస్ కృష్ణా, విశాఖపట్నం ❍ పీఆర్ కళాశాల, కాకినాడ ❍ ఏఎస్‌డీ (మహిళా), కాకినాడ ❍ జీడీసీ (ఏ) రాజమండ్రి ❍ ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్, విజయవాడ ❍ జీడీసీ (మహిళా), గుంటూరు ❍ డీకేడబ్ల్యూ, నెల్లూరు ❍ జీడీసీ (పురుష), కడప ❍ జీడీసీ (మహిళా), కడప, ❍ జీడీసీ (పురుష), అనంతపురం ❍ కేవీఆర్ (మహిళా) కర్నూలు ❍ సిల్వర్‌జూబ్లీ, కర్నూలు

# సేవలు అందించేందుకూ కోర్సులు!

భారతదేశంలో దాదాపు రెండు శాతం మంది ఏదో ఒక వైకల్యంతో బాధ పడుతున్నారని ఒక అంచనా. వీరికి వైద్యంతోపాటు ప్రత్యేక సేవలూ అవసరమవుతాయి. ఇందుకోసం నాణ్యమైన మానవ వనరులు కావాలి. వాటిని సమకూర్చడానికి కొన్ని సంస్థలను నెలకొల్పారు. వాటిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌ఫర్ లోకోమోటార్ డిజెబిలిటీస్ (ఎన్ఐఎల్‌డీ) ఒకటి. ఇందులో ఆర్థోపెడిక్ సేవలు లక్ష్యంగా పలు కోర్సులను రూపొందించారు. ఈ కోర్సుల్లోకి ప్రవేశాలను ఉమ్మడి పరీక్ష ద్వారా కల్పిస్తారు.

వైద్యరంగంలో వైద్యులతోపాటు ఇతర మెడికల్ కోర్సులు చదివినవారికీ డిమాండ్ ఉంటుంది. నొప్పి నుంచి ఉపశమనం కలిగించడం, త్వరగా కోలుకునేలా చేయడం, ప్రమాద బారిన పడినవారిని సాధారణ స్థితికి తీసుకురావడం... ఇవన్నీ ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్ లాంటివాటితో సాధ్యం. అందుకే ఈ అంశాల్లో నిపుణులను తయారుచేయడానికి ప్రత్యేక సంస్థలు ఏర్పాటు చేశారు. ఇవి కేంద్రంలోని మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీటిల్లో బోధన ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయి. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడి పరీక్ష నిర్వహిస్తున్నారు.

### మూడు డిగ్రీలు

- బ్యాచిలర్ ఆఫ్ ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్ (బీపీవో)
- బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ (బీపీటీ)
- బ్యాచిలర్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీ (బీవోటీ)

**అర్హత:** బీపీవో, బీవోటీ, బీపీటీ కోర్సులకు ఎంపీసీ లేదా బైపీసీ ఉత్తీర్ణులు అర్హులు. జనరల్ అభ్యర్థులైతే కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు మార్కుల శాతంలో సడలింపులు వర్తిస్తాయి.

**వయసు:** జనవరి 1, 1998 - డిసెంబరు 31, 2001 మధ్య జన్మించినవారే అర్హులు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు ఉంది.

**వ్యవధి:** ప్రతి కోర్సు వ్యవధీ నాలుగేళ్లు. అదనంగా మరో ఆరు నెలలు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది.

### ప్రవేశం కల్పించే సంస్థలు

■ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ లోకోమోటివ్ డిజెబిలిటీస్ - కోల్‌కతా
■ స్వామీ వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిహాబిలిటేషన్ ట్రెయినింగ్ అండ్ రిసెర్చ్ - కటక్ ■ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్ - చెన్నై

పునరావాస కేంద్రాలు, ఆసుపత్రులు, ఎన్జీవోలు మొదలైన చోట్ల అవకాశాలు ఉంటాయి. సొంతంగానూ ఉపాధి పొందవచ్చు.

### పరీక్ష తీరు

పరీక్ష వ్యవధి 2 గంటలు. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలు ఇంటర్మీడియట్ స్థాయిలో ఇస్తారు. ప్రశ్నపత్రంలో రెండు విభాగాలు ఉంటాయి. ఇందులో పార్ట్-ఎలో జనరల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు వస్తాయి. వీటికి పది మార్కులు. పార్ట్-బిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ బయాలజీ లేదా మ్యాథ్స్ ఒక్కో సబ్జెక్టు నుంచి 30 చొప్పున ప్రశ్నలు ఉంటాయి. మొత్తం వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు.

**దరఖాస్తు ఫీజు:** ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.600 మిగిలిన అందరికీ రూ.750. **ఆన్ లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** మే 25

**పరీక్ష తేదీ:** జూన్ 17

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం సికింద్రాబాద్‌లో ఉంది.

వెబ్‌సైట్: http://niohkol.nic.in

ADMISSION GUIDANCE
MBBS
CHINA ◆ PHILIPPINES ◆ CENTRAL AMERICA
MCI RECOGNISED UNIVERSITIES
Washington University of Health Sciences
4½ సం॥ మెడిసిన్ తరువాత US లో PG చేసే గొప్ప అవకాశం.
KOSANA. SRINIVASA RAO
Guest faculty : NSM, CHINA, HUBEI College, China
మెడికల్ కాలేజీలో 14 సం॥ అనుభవం కలిగిన అధ్యాపకులచే నడుపబడుచున్న సంస్థ
10 లక్షల స్కాలర్‌షిప్ కలదు
OC-Kapu, BC, SC, ST
KARTHIKEYA EDU SERVICES
4/14, Brodipet, GUNTUR.
91602 42585, 90323 23668
రూ.15లక్షల నుండి మెడిసిన్ (5 సం॥లకు, హాస్టల్‌తో కలిపి)

# నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

#### మెయిల్ మోటార్ సర్వీసులో డ్రైవర్లు

హైదరాబాద్‌లోని మెయిల్ మోటార్ సర్వీసులో స్టాఫ్ కార్ డ్రైవర్ పోస్టుల భర్తీ. **పోస్టు-ఖాళీలు:** స్టాఫ్ కార్ డ్రైవర్(ఆర్డినరీ గ్రేడ్)- 10 **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత, ఎల్‌హెచ్‌ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్, మోటార్ మెకానిజంతో పాటు డ్రైవింగ్‌లో మూడేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

**ఎంపిక:** డ్రైవింగ్ టెస్ట్ ఆధారంగా.

**దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరి తేది:** 25.06.2018.

**వెబ్‌సైట్:** www.indiapost.gov.in

### వాక్ ఇన్ ఇంటర్వ్యూ

#### నవోదయ విద్యాలయ సమితిలో టీచర్లు

హైదరాబాద్ రీజియన్‌లోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఒప్పంద ప్రాతిపదికన టీచర్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు.

**పోస్టులు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు, క్రియేటివ్ స్టాఫ్, లైబ్రేరియన్, పీఈటీ తదితరాలు.

**అర్హతలు:** పీజీ, డిగ్రీ, బీఈడీ, బీపీఈడీ, సీటెట్ ఉత్తీర్ణత.

**వయసు:** 64 ఏళ్లు మించకూడదు.

**ఇంటర్వ్యూ తేదీలు:** మే 28, 29.

**వేదిక:** జేఎన్‌వీఎస్ హైదరాబాద్ రీజియన్‌లోని సంబంధిత విద్యాలయాల్లో. **వెబ్‌సైట్:** http://navodayahyd.gov.in/

#### సమీర్‌లో ఐటీఐ అప్రెంటిస్ ట్రెయినీలు

ముంబయిలోని సొసైటీ ఫర్ అప్లయిడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అండ్ రిసెర్చ్(సమీర్)లో ఐటీఐ అప్రెంటిస్ ట్రెయినీల భర్తీ. **పోస్టు-ఖాళీలు:** ఐటీఐ అప్రెంటిస్ ట్రెయినీ- 42. **ట్రేడులు:** ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రోప్లేటర్, డ్రాఫ్ట్స్‌మన్ మెకానికల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, పీఏఎస్‌ఏఏ, ఐటీ, ఈఎస్ఎం. **అర్హత:** పదోతరగతి, ఐటీఐ, పీఏఎస్‌ఏఏ ట్రేడుకైతే ఇంటర్ ఉత్తీర్ణత. **ఇంటర్వ్యూ తేదీలు:** మే 28, 29, 30 తేదీల్లో. **వేదిక:** సమీర్, ఐఐటీ క్యాంపస్, హిల్ సైడ్, ముంబయి. **వెబ్‌సైట్:** www.sameer.gov.in

#### ఐఐసీటీలో ప్రాజెక్ట్ అసిస్టెంట్లు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ)లో తాత్కాలిక ప్రాతిపదికన పలు ఖాళీల భర్తీ.

**పోస్టు-ఖాళీలు:** రిసెర్చ్ అసోసియేట్- 07, సీనియర్ రిసెర్చ్ ఫెలో- 03, జూనియర్ రిసెర్చ్ ఫెలో- 02, ప్రాజెక్ట్ అసిస్టెంట్- 21.

**అర్హత:** బీటెక్, బీఏఎంఎస్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంఫార్మసీ, పీహెచ్‌డీ, నెట్, గేట్ ఉత్తీర్ణత. పని అనుభవానికి ప్రాధాన్యం. **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా.

**ఇంటర్వ్యూ తేదీలు:** మే 28, 29. **వేదిక:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ), హైదరాబాద్. **వెబ్‌సైట్:** www.iictindia.org

### ప్రవేశాలు

#### ఆల్ ఇండియా ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్-2018

న్యూదిల్లీలోని రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన 450 కళాశాలల్లో డిప్లొమా కోర్సు ప్రవేశాలకు నిర్వహించే ఆల్ ఇండియా ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్-2018(ఏఐవోఏటీ) ప్రకటన విడుదలైంది. **కోర్సులు:** స్పెషల్ ఎడ్యుకేషన్/ డిసేబిలిటీ రిహాబిలిటేషన్‌లో డిప్లొమా కోర్సులు **కాలపరిమితి:** రెండేళ్లు. **సీట్ల సంఖ్య:** 17,500 **అర్హత:** 50% మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ఆధారంగా. **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేది:** 20.06.2018. **ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష తేది:** 30.05.2018.
**వెబ్‌సైట్:** http://rehabcouncil.nic.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు

చదువు
ఈనాడు
హైదరాబాద్
బుధవారం మే 23, 2018 ■ e-mail: edc@eenadu.in
10

డిగ్రీ అంటే... డిగ్రీనా అని పెదవి విరిచే రోజులకు కాలం చెల్లింది. మన డిగ్రీలన్నీ మారిపోతున్నాయ్. సంప్రదాయ రీతులను దాటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త రూపంలో ప్రొఫెషనల్ కోర్సులకు దీటుగా వస్తున్నాయి. బీఏలో టూరిజం, బీకామ్‌లో ఈకామర్స్, బీఎస్సీలో సెరీ కల్చర్, పౌల్ట్రీ సైన్స్, ఫారెస్ట్రీ వంటి విభిన్న కాంబినేషన్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. అందుకే నిపుణులు సైతం 'ఒకప్పటి డిగ్రీ కాదు!' అంటున్నారు. ఇప్పటికే పలు పరిశ్రమలు పీజీ విద్యార్థులను కాదని... డిగ్రీ విద్యార్హత ఉన్నవారిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నాయి. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్- తెలంగాణ (దోస్త్) ద్వారా డిగ్రీ కళాశాలల్లోకి పేర్ల నమోదు ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో రూపుమారిన డిగ్రీ కోర్సుల గురించీ...ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించీ తెలుసుకుందామా?




# ఒకప్పటి డిగ్రీ కాదు గురూ!

ఎన్నో కొత్త కొత్త కోర్సులు వస్తున్నా...డిగ్రీ కోర్సులు తమ మనుగడను ఇప్పటికీ కాపాడుకుంటూనే ఉన్నాయి. ఇంటర్ పాసైన 70 శాతం విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లోనే ప్రవేశాలు పొందుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏటా 2.20 లక్షల మంది చేరుతున్నారు. ఒకప్పటి మాదిరిగా సబ్జెక్టుల కాంబినేషన్లు కాకుండా కాలానుగుణంగా మారిన...మార్కెట్లో గిరాకీ ఉన్నవాటిని ఎంచుకుంటే సాధారణ డిగ్రీతోనే మంచి భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చు.

కొద్ది సంవత్సరాల క్రితం బీఏ, బీకాం, బీఎస్సీలలో కేవలం అయిదారు...గరిష్ఠంగా పది లోపు కాంబినేషన్లు ఉండేవి. ఇప్పుడు ఒక్క బీఏలోనే 68 రకాల కోర్సులు వచ్చాయి. అంటే ఒక విద్యార్థి 68 రకాల్లో ఏ కోర్సులైనా ఎంచుకోవచ్చు. ఇక బీఎస్సీలో 73 రకాల కోర్సులు, బీకాంలో 13 రకాల కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. వాటితోపాటు బీబీఎం, బీబీఏ, బీసీఏ, బ్యాచిలర్ ఆఫ్ సోషల్ వర్క్ (బీఎస్‌డబ్ల్యూ), బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ (బ్యాంకింగ్- ఇన్సూరెన్స్; హాస్పిటాలిటీ- టూరిజం అడ్మినిస్ట్రేషన్) కోర్సులు ఆయా విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.



## ఎక్కడైనా ప్రవేశం

మూడేళ్ల క్రితం ఎక్కడో మారుమూల విద్యార్థి హైదరాబాద్‌లో చేరాలంటే నగరానికి వచ్చి రూ.500 నుంచి రూ.1000 పెట్టి దరఖాస్తు కొనుగోలు చేసి సమర్పించాలి. ఒక్కో కళాశాలకు ఒక్కో దరఖాస్తు కొనాలి... వరంగల్‌లో చేరాలంటే అక్కడికి వెళ్లాలి. ఇప్పుడు కేవలం రూ.200తో రాష్ట్రంలోని ఏ కళాశాలకయినా దరఖాస్తు చేసుకోవచ్చు. అందుకు కారణం- డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్- తెలంగాణ (దోస్త్) అందుబాటులోకి రావడమే. డిగ్రీ ప్రవేశాలకు 2016-17 విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.200 చెల్లించి దోస్త్ వెబ్‌సైట్ నుంచి ఎంసెట్ తరహాలో ఎన్ని కళాశాలలకైనా, కోర్సులకైనా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. దీనివల్ల ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన మారుమూల విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నిజాం, సిటీ కళాశాలల్లోనూ సీట్లు సాధిస్తున్నారు.

## డిగ్రీలోనే పీజీ తరహా

ఒకప్పుడు కేవలం పీజీ చదువులోనే స్పెషలైజేషన్లు ఉండేవి. డిగ్రీ విద్యతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాలన్న లక్ష్యంతో పలు స్పెషలైజ్‌డ్, పరిశోధన తరహా సబ్జెక్టులను ప్రవేశపెడుతున్నారు. పీజీ విద్యపై ఆసక్తి ఉంటే వెళ్లొచ్చు. లేదంటే డిగ్రీ పరిజ్ఞానంతో అవకాశాలను అందుకోవచ్చు.. ఉదాహరణకు బీఎస్సీ ఎంపీసీలో గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలు, బైపీసీ విద్యార్థులకు అయితే వృక్ష, జంతు, రసాయనశాస్త్రాలు ఉండేవి. కాలానుగుణంగా పీజీలో ఉండే మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, ఫుడ్ సైన్స్, పౌల్ట్రీ సైన్స్, ఫిషరీస్, సెరీకల్చర్ మొదలైనవి వచ్చి చేరాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కంప్యూటర్‌పై అవగాహన తప్పనిసరి అవుతుండటంతో ఒక సబ్జెక్టుగా కంప్యూటర్ అప్లికేషన్స్ కూడా ప్రవేశపెట్టారు.

బీఎస్సీ, బీకాంలోనే కాదు...బీఏలోనూ కంప్యూటర్ అప్లికేషన్స్ ఒక సబ్జెక్టుగా చేరింది. బీఏలో గత ఆరేడు సంవత్సరాలుగా కంప్యూటర్ అప్లికేషన్స్ కాంబినేషన్ కేవలం ప్రైవేట్ కళాశాలల్లోనే ఉండగా ఇప్పుడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనూ ప్రవేశపెట్టారు. దీనివల్ల ఇప్పుడు డిగ్రీ విద్యార్థులకూ ఉద్యోగావకాశాలు పెరిగాయి. సివిల్ సర్వీసెస్ విధానాన్ని 2014 నుంచి మార్చటంతో హైదరాబాద్‌లోని కొన్ని కళాశాలలు డిగ్రీతోపాటు సివిల్స్ శిక్షణ ఇస్తున్నాయని విద్యార్థులు బీఏ కోర్సుల్లో చేరుతున్నారని అడ్వాంటా డిగ్రీ కళాశాల ఛైర్మన్ బైరెడ్డి లక్ష్మారెడ్డి చెప్పారు.

## ఏ స్పెషలైజేషన్ ఎక్కడో...

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 1049 డిగ్రీ కళాశాలల్లో దోస్త్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో సీట్లను భర్తీ చేస్తున్నారు. విద్యార్థులు తమకు నచ్చిన కోర్సు, సబ్జెక్టుల కాంబినేషన్లను దోస్త్ (dost.cgg.gov.in) వెబ్‌సైట్లోకి వెళ్లి కుడి వైపున ఉన్న సెర్చ్ బై కాలేజీ/కోర్సెస్ వద్ద క్లిక్ చేస్తే కళాశాలలోని కోర్సు, కాంబినేషన్లు, సీట్ల సంఖ్య, రుసుముల వివరాలు ప్రత్యక్షమవుతాయి. సైన్స్ కోర్సులకు ప్రయోగశాలలు చాలా ముఖ్యం. కళాశాలలను ఎంచుకునేటప్పుడు అక్కడ అవి ఉన్నాయో, లేవో తెలుసుకోవడం ముఖ్యం. దోస్త్ ద్వారా కాకుండా మరో 42 కళాశాలలు సొంతగా ప్రవేశాలు నిర్వహించుకుంటున్నాయి. వాటిల్లో ఒకటీ రెండు తప్ప మిగిలినవి హైదరాబాద్‌లోనే ఉన్నాయి. వాటిల్లో పలు రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. సుమారు 9 వేల సీట్లున్నాయి.

## డిగ్రీ వాళ్లు చాలు!

ఖర్చులు తగ్గించుకునేందుకు కొన్ని పరిశ్రమలు తమ ఉద్యోగులు అందరికీ పీజీలు అవసరమని కోరుకోవడం లేదు. కొంత ఆంగ్ల నైపుణ్యం, సబ్జెక్టు పరిజ్ఞానం ఉన్న డిగ్రీ విద్యార్థులూ చాలంటున్నాయి. వారిని తమ అవసరాలకు తగ్గట్లు మార్చుకోవచ్చని భావిస్తున్నాయి. అందుకే ఇటీవలి కాలంలో పలు ఐటీ, ఫైనాన్స్ కంపెనీలు నేరుగా డిగ్రీ కళాశాలలకే వచ్చి ప్రాంగణ నియామకాల్లో ఎంపిక చేసుకుంటున్నాయి. ఐటీ కంపెనీలు సైతం ముఖ్యంగా బీకాం, బీబీఏ విద్యార్థులను భారీగా నియమించుకుంటున్నాయి. మూడేళ్లలోనే కోర్సు పూర్తవుతుంది. రూ.14 వేల వేతనంతో ఉద్యోగాలు దక్కుతున్నాయి. దాంతోపాటు ఈ కోర్సులు చదివితే గ్రూపు, సివిల్స్ రాయడానికి ప్రయోజనకరంగా ఉంటుందని విద్యార్థులు భావిస్తున్నారని హన్మకొండలోని చైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి చెప్పారు. బీకాం, బీబీఏ చదువుతూనే మరోవైపు సీఏ, ఐసీడబ్ల్యూఏ లాంటి ప్రొఫెషనల్ కోర్సులను పూర్తి చేస్తున్నారని భద్రుకా కళాశాల ప్రిన్సిపల్ సోమేశ్వర్ రావు చెప్పారు. రెడ్డీస్ లాంటి కొన్ని ఫార్మా పరిశ్రమలు ఇప్పుడు బీఎస్సీ విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నాయి.

## గడువు కొద్దిరోజులే..

- మే 26: రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్లకు తుది గడువు
- మే 27-29 తేదీ వరకు: రూ.400 ఆలస్య రుసుంతో రిజిస్ట్రేషన్లకు గడువు
- జూన్ 4: మొదటి విడత సీట్ల కేటాయింపు
- జూన్ 5-14: రెండో విడత వెబ్ ఆప్షన్లు (మొదటి విడతలో పాల్గొన్నవారు సీట్లు మారేందుకు)
- జూన్ 19: రెండో విడత సీట్ల కేటాయింపు
- జూన్ 20-27: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో పాసైన వారితోపాటు కొత్తగా ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

- **పెమ్మసాని బాపనయ్య,** ఈనాడు- హైదరాబాద్

## విభిన్న సబ్జెక్టుల కాంబినేషన్లు

### బీఏలో..

- కమ్యూనికేటివ్ ఇంగ్లిష్+ కంప్యూటర్ అప్లికేషన్లు+ ఆఫీస్ మేనేజ్‌మెంట్
- ఆర్థికశాస్త్రం+ ఆఫీస్ మేనేజ్‌మెంట్+ కంప్యూటర్ అప్లికేషన్లు
- చరిత్ర+ కంప్యూటర్ అప్లికేషన్లు+ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్
- చరిత్ర+ రాజకీయ శాస్త్రం+ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్
- గణితం+ ఆర్థికశాస్త్రం+ కంప్యూటర్ అప్లికేషన్లు

### బీకాంలో..

- అడ్వర్‌టైజింగ్- సేల్స్ ప్రమోషన్- సేల్స్ మేనేజ్‌మెంట్
- బ్యాంకింగ్ - ఇన్సూరెన్స్- కంప్యూటర్ అప్లికేషన్స్
- ఈ-కామర్స్
- టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్
- ఫారెన్ ట్రేడ్ ప్రాక్టీసెస్ అండ్ ప్రొసీజర్స్

### బీఎస్సీలో..

- అప్లైడ్ న్యూట్రిషన్ అండ్ పబ్లిక్ హెల్త్+ వృక్షశాస్త్రం+ రసాయనశాస్త్రం
- బయోటెక్నాలజీ+ రసాయనశాస్త్రం+ కంప్యూటర్ అప్లికేషన్లు
- బయోటెక్నాలజీ+ రసాయనశాస్త్రం+ ఫోరెన్సిక్ సైన్స్
- బయోటెక్నాలజీ+జంతుశాస్త్రం+కంప్యూటర్ అప్లికేషన్స్
- బయోటెక్నాలజీ+ మైక్రోబయాలజీ+ కంప్యూటర్ అప్లికేషన్స్
- వృక్షశాస్త్రం+ ఫారెస్ట్రీ+ రసాయనశాస్త్రం
- వృక్షశాస్త్రం+రసాయనశాస్త్రం+ ఫుడ్ సైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్
- బయోటెక్నాలజీ+ రసాయనశాస్త్రం+ ఫుడ్ సైన్స్ అండ్ కంట్రోల్
- జన్యుశాస్త్రం అండ్ బయోటెక్నాలజీ+ వృక్షశాస్త్రం+ బయలాజికల్ కెమిస్ట్రీ
- ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ+జంతుశాస్త్రం+ రసాయనశాస్త్రం
- మైక్రోబయాలజీ+ అప్లైడ్ న్యూట్రిషన్ అండ్ పబ్లిక్ హెల్త్+ రసాయనశాస్త్రం
- పౌల్ట్రీ సైన్స్+ జంతుశాస్త్రం+ రసాయనశాస్త్రం
- సెరీ కల్చర్+ వృక్షశాస్త్రం+ జంతుశాస్త్రం
- న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్+ జుంతుశాస్త్రం+ రసాయన శాస్త్రం

## భిన్నమైన కోర్సులు.. బోలెడు అవకాశాలు



ఇటీవలికాలంలో విద్యార్థులకు...అందులోనూ ప్రధానంగా సైన్స్ విద్యార్థులకు విభిన్నమైన కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ వంటివీ, బైపీసీ విద్యార్థులకు సంప్రదాయ సబ్జెక్టులతోపాటు మైక్రో బయాలజీ, బయో టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ లాంటి అధునాతన కోర్సులనూ కళాశాలలు అందిస్తున్నాయి. మెడికల్ మైక్రో బయాలజీ, ఫుడ్ మైక్రో బయాలజీ, ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్, క్లినికల్ రిసెర్చ్, మాలిక్యులర్ బయాలజీ, ఫోరెన్సిక్ సైన్స్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, సౌందర్య సాధనాల తయారీ రంగాల్లో ఉపాధి అవకాశాలున్నాయి. గణాంకశాస్త్రం (స్టాటిస్టిక్స్)లో డిగ్రీ ఉన్న అభ్యర్థుల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయి. ఎన్నో రుగ్మతలకు ఆహారపు అలవాట్లు , జీవన విధానంలో మార్పులే నివారణ మార్గమని భారతీయులు గుర్తిస్తున్నారు. అందుకే హోం సైన్స్‌లో అంతర్భాగంగా ఉండే న్యూట్రిషన్, డైటెటిక్స్ వంటి కోర్సులకు ఆదరణ పెరుగుతోంది. కెరియర్‌లో ఉన్నతంగా స్థిరపడాలనుకునే విద్యార్థులు మాత్రం డిగ్రీతో సరిపెట్టుకోకుండా పీజీ చదువుకోవడం తప్పదు.

- **డాక్టర్ నీరజ,** అకడమిక్ ఆఫీసర్, కళాశాల విద్యాశాఖ